# అమరుడు నీలా!

అవును ! ఆ సంగతి ఇప్పుడు తలచుకుంటేనే గుండె ఝుల్లు మంటుంది. నీలూ ఎటువంటివాడు ! ఎంతటి మేధావి ! ఆ తండా తండా అంతా వెదికినా నీలువంటి వాడు మరొక డేడీ?

నీలూ ఏమిటో పిచ్చి పిచ్చి పాటలు పాడుకొంటూ ఆ సెలయేటి ఒడ్డునే ఆ రావిచెట్టుక్రింద నిద్రపోయేవాడు. అలా ఒంటరిగా ఉంటేనే అతని కెంతో హాయిగా ఉండేది!

ఆ సెలయేరు ఆదిమ మానవుని బాధల గాథలను ఏవేవో పాటలుగా వినిపించేది. నీలూ అలావింటూ కనుల నీరు నించేవాడు. రావిచెట్టు తన చల్లనిగాలి చేతులతో అతని తలను మృదువుగా నిమిరేది. నీలూ దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచేవాడు.

ఆ సెలయేటి ఒడ్డున ఆ రావిచెట్టు నీడను నీలూ ఎప్పుడూ దీర్ఘంగా ఆలోచించేవాడు. అతని ఎట్ట ఎదుట కీకారణ్యం దట్టంగా మానవుల కజేయమైనదిగా నిలచి ఉంది.

ఆకసాన్ని చుంబిస్తూన్న ఆ మహోన్నత వృక్షసంతతి ముందు అతను మోకరిల్లాడు ! భయంకరమైన విషసర్పాలు,

క్రూరమృగాలు అన్నీ అన్నీ తమస్వేచ్ఛ కే ఆటంకంలేకుండా అందులో సంచరిస్తున్నాయి. వాటిని తలచుకుంటేనే శరీరం భయకంపితమౌతూంది.

ఆ రోజున ఆ సెలయేటిఒడ్డున నీలూ మనసు మనసులో లేదు. వట్టివ్రేళ్ళతో అతివిచిత్రంగా అల్లిన అంగవస్త్రం అతని కెంతో మోహనంగా అమరింది. అతని శరీరం అందమైన బలిష్ఠమైన విల్లులా సాగి మానవాతీతమైన తేజస్సును వెద జల్లుతూంది అతని చిన్నిగడ్డం అందంగా గుబురుగా సోయగాలను వర్షిస్తూంది. అతని ఉంగరాలతల ఆపైన మోహనంగా ముడివడి సౌందర్యాన్ని పుష్టిస్తూంది. 'ఆకోన తేలిన నాసిక కిరుప్రక్కలా ఆ విశాలమైన కనులలో దయాహృదయం కొనలుసాగి ఆకర్ణాంతము విస్ఫారుకొని ఉంది.

చెట్లనుండి పుష్పాడి రాలుతూంది. ఆకసం నిర్మలంగా ఉంది. సెలయేరు తనను తాను మరచి నిశ్చల సమాధిలో మునిగిపోయిఉంది. అక్కడో పక్షి అటురెక్కలల్లార్చి పైకెగిరింది. ఇక్కడో కోయిల ఎవరికోసమో పాటలల్లు కొంటూఉంది. ఏ అభ్యుదయ కాంతిరేఖ కోసమో తపించి పోతూంది!

"దుఃఖించకు నీలూ... ఈ ప్రజలు అంతే..." అని అత నిలో అతనిని ఎవ్వరో ఊరడిస్తున్నారు.

దీర్ఘములైన ఆ నేత్రాలలో ఏదో తపన తొణికసలాడు తూంది. "ప్రాణంపోయినాసరే ఈ సత్యాన్ని ప్రజల కెరుక పరచాలి... అవును..." అనుకున్నాడు నీలూ.

"తన కింత స్పష్టంగా కనిపిస్తూన్న సత్యం ఎందుచేత ఈ ప్రజలు దర్శించలేకపోతున్నారు ? ఎంత చెప్పినా ఎందు కవగాహన చేసుకోలేకపోతున్నారు ? తన మిత్రులకు తాను గ్రహించిన సత్యం ఎరుక పరచాడు. కాని వారు తనను ఏమాత్రం అర్థంచేసుకోకుండా అవమానపరిచారు. తనను నిరుత్సాహపరిచారు. అప్పటినుంచీ తను ఆ విషయం గురించి తరచి తరచి ఆలోచిస్తున్నాడు. దాన్ని ప్రజల ముందు పెట్టే సమయంకోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. కాని ఆ ప్రజల మనస్తత్వం తనకు పూర్తిగా తెలుసు. వాళ్లు పిరికి వాళ్లు. ఎందుకనో అకారణంగా భయపడుతూ ఉంటారు. అసలు నిజం తెలుసుకోరు. ముందుగానే భయంలో కూరుకుపోతు న్నారు. అందులోంచి బయట పడటం వాళ్ళకు చాతకావడం లేదు. పాత అలవాట్లను మార్చుకోవడం అంటే వాళ్ళకు చెడ్డ భయంగా ఉంటూంది. వాళ్ళ భయం వాళ్లదే. ఆభయంతో వాళ్ళేటువంటి నీచమైన పనులకైనా సిద్ధపడుతున్నారు. వాళ్లు ఏమాత్రమైన జ్ఞానసంపన్నులు కావాలంటే వాళ్ళా భయాన్ని మరచిపో గలగాలి. కాని ఆ పనిమాత్ర వాళ్ళుచేయలేక పోతున్నారు. అవును... కాని ఎందువల్ల ఇలా జరుగుతూంది? జ్ఞానం, భయం గుప్పిటలో ఇరుక్కొని పులుగులా గిలగిల కొట్టుకుంటూంది. జ్ఞానానికి భయం మృత్యువు ! ఈ మృత్యువును ఎట్లా జయించడం ? ఈ ప్రజల కిదంతా నచ్చ జెప్పడమెలా ?" పాపం నీలూ పూర్తిగా నిరుత్సాహపడి పోయాడు.

ఆ రోజున ఆ తండా తండా అంతా యుద్ధానికి బయలు దేరుతూంది. నీలూకు యుద్ధం అంటే అసలు కిట్టదు. ఈ విషయాన్ని వాళ్లకెంతో నచ్చజెప్ప దలచుకున్నాడు. వద్దు మనం యుద్ధాలు చేయవద్దు అన్నాడు. కాని వాళ్లు వినేశక్తి ఉన్నవారు కాదు. పైపెచ్చు, "నీలూ నీకేమి తెలియ దూరుకో... నిన్ను చూస్తూ ఉంటే దొర కసలే కోపంగా ఉంది. నీవంటి మూర్ఖుడు... సోమరి... ఇంకొక దుండడని దొర అసహ్యించు కుంటున్నాడు..." అన్నాడు మన్ను.

నీలూ, మన్నువైపు అలాగే రెప్ప వేయకుండా చూశాడు. ఆ చూపులో ప్రతిభ దెబ్బతిన్న పులుగులా చలించిపోయింది. "ఔను — తెలివి హీనుల కందరూ అలాగే కనిపిస్తారు మన్నూ..." అన్నాడు.

వెంటనే మన్నూ, చాల్లేవయ్యా... మహా తెలివైన వాడివి బయలు దేరావు... నువ్వు వస్తే రా... లేకపోతే మానెయ్... నీవంటి పిరికి పంద ఇంకొకడుండడని అప్పుడే మనగుంపు గుంపు అంతా గుసగుస లాడుతూంది. అంతపిరికి వాడవైపోతావేం... మన దగ్గర ఉన్న ఆయుధాలు ఈచుట్టు పట్ల ఉన్న ఏతండాకీ లేవు తెలుసా... మొన్న మన నిప్పు బలే రాతి గొడ్డలి చేశాడు. దాన్ని చూశావంటేనే హడలి పోతావు. దానితో పందతలల్ని ఒక్కసారి నరికిపారెయ్యొచ్చు ఈ భూమి పుట్టిం తరువాత ఇలాంటి ఆయుధమే పుట్టలేదు. అందరూ నిప్పును ఎంతో పొగడు తున్నారు. నిప్పు మనకు

జీవంపోసినట్లు సాటితండాలమీద ఆధిపత్యం నెరపడానికి మనకు బ్రహ్మాండమైన శక్తిని ప్రసాదించినట్లు అందరూ తల పోస్తున్నారు. ఇంకొన్నాళ్లుపోతే నిప్పును దేవుడులా పూజి స్తారు కూడాను. వాడు ఎంత శ్రమకోర్చి ఈ ఆయుధాన్ని సాధించాడో తెలుసా— అప్పుడే కొన్ని తండాలు ఈ విష యం తెలిసి గుండెలరచేతితో పట్టుకొని ఉన్నాయట... ఈసారి మనం వాళ్ల మీదికి వెళ్లి విరుచుక పడటమే తడవు... వాళ్లదగ్గర ఉన్న ఆహార పదార్థాలు మనకప్పజెప్పి చెట్టు కొకడు పుట్టకొకడుగా పారిపోతారు. అలాచేయకుండా వేధ వలు ఎదురు నిలిచారా ఏముంది వాళ్ల పని...సఫా...అంతే. ఒక్కడు మిగలడు. వాళ్లను చంపేసి వాళ్ల రక్తం గడగడ తాగెయ్యడమే... ఏమిటనుకున్నావో...! అన్నాడు.

నీలూ పెద్ద కళ్లల్లో నీళ్లు నిలిచాయి. 'ఎందుకు మన్నూ ఈ రక్తపాతం...పాపం వాళ్ళు ఏమిచేశారు. వాళ్లనుచంపితే మనకేం వస్తుంది.'

మన్నూ నీలూవైపు ఒళ్ళంతా కంపరమెత్తినట్లు చూశాడు. వెంటనే, 'ఛీ... ఏమి మగాడివోయ్ నువ్వు... నీలాంటి పిరికిపంద నింతవరకు చూడలేదు. మా తాత ఉన్నా డంటే నిన్నిపాటికి ముక్కల ముక్కల క్రింద కోయించేసే వాడు. నీలాంటివాళ్లుంటే అందరిగుండెల్లోనూ పిరికితనమే బలిసిపోతుంది. మన తండాలో నువ్వు చెడ బుట్టావోయ్... నా మాటవిని నీ బుద్ధి మార్చుకో...'

నీలూకు నిస్పృహ హెచ్చుతూంది. అయినా అతను తన
శక్తిని గట్టిగా నమ్మినవాడు. తను గ్రహించిన సత్యాన్ని
దాని బలాన్ని పూర్తిగా ఎరిగి ఉన్నవాడు. అంచాత అతను
గట్టిగా నిలబడ్డాడు.

'అదికాదు మన్నూ... మనం వాళ్ళమీద కిప్పుడెందుకు
యుద్ధానికి వెళ్తున్నాం' అని ప్రశ్నించాడు.

మన్నూ, 'నీకు పూర్తిగా మతిపోయిందోయ్, మన
ఆహారపదార్థాలు రోజురోజుకూ తరిగిపోతున్నాయ్ కన
బడటంలేదూ ... మన చెరువులో చేపలు అయిపో
వచ్చాయి... మనచెట్లు ఇంకెన్నాళ్ళో కాసేట్టులేవు. అడవిలో
మృగాలను చంపలేక చస్తున్నాం. అవే మనల్ని తినే
స్తున్నాయి. ఎప్పుడో ఒక్కటి దొరికితే ఆరోజు పండగలా
ఉంటోంది. అక్కడక్కడ చచ్చిచెడి ఏవేవో ఏరి తెచ్చు
కున్న తృణధాన్యాలు మిగిలి చావడంలేదు. ఇక ఇలాంటి
పరిస్థితిలో ఏమి చెయ్యాలి? నీకసలు ముందుచూపే లేదు.
నీవు వట్టి పనికిమాలినవాడవు. మనతండా తండా అంతా
నాశనమైపోతూంటే చూస్తూ కూర్చోగలవు. స్వజాతిని నాశ
నంచేసే వాడెవ్వడూ ఇంతవరకు పుట్టలేదు! ఎక్కడ దారి
కావయ్యా మాకు. నీమూలాన మాకు నిస్సత్తువ ఏర్పడు
తోంది. మమ్మల్ని నడపడానికి ఉషారుగా ముందడుగు
వేయవలసిన వాడవు ఇలా ఇక్కడ నీళ్ళు కారిపోతూ
కూర్చుండడం ఏమీ బాగులేదు. నా మాట విని, నీపిచ్చిపిచ్చి

ఆలోచనలు కట్టిపెట్టు. ఆకలితో మనం ఎక్కడ చావగలం... చిన్న బల్లినిచూడు, పురుగుల్ని ఎలా చంపుకు తింటుందో... పాపం ఆ తేనెటీగలు దాచుకున్న తేనెనంతా మనం దోచుకొని తెచ్చుకోవడం లేదూ... అన్యాయం అన్యాయం అనుకుంటూ కూడ్చుంటే మనం ఎక్కడ కాలు కదపగలం ? మన సృష్టి ధర్మమే అది. ఎవడు బలంగా ఉంటాడో వాడే బ్రతుకుతాడు...'

నీలూ మెల్లిగా, 'అది సరే మన్నూ... నీ ఆకలికోసమే కదూ... వాళ్లను చంపుతానంటున్నావు...'

'చంపుతా ననడంలేదు. వాళ్ల ఆహారపదార్థాలు లాక్కుపోదాం అంటున్నా, అడ్డువచ్చిన వాళ్లనుమాత్రం చంపేద్దాం...'

'అవును మన్నూ వాళ్ల పదార్థాలను ఎత్తుకపోయినా వాళ్ళను చంపినట్లే అవుతుంది. నీ దగ్గర బలం ఉంది కాబట్టి వాళ్ళను చంపుతా నంటున్నావు. నీకన్నా బలమైనవాళ్ళు రేపొద్దుట నిప్పు కనిపెట్టిన ఆయుధంకన్నా గొప్పది కనిపెట్టి నీమీద విరుచుకపడితే అప్పుడు నీకెలా ఉంటుంది...'

'ఇదిగో నీలూ... పిచ్చెత్తుతోంది. నీలాంటి వాణ్ణి చంపివెయ్యడమే మంచిది. కాని నిన్ను చూస్తూంటే ఎందుకనో అలా చేయాలనిపించడంలేదు. నా మాటవిని, నీలూ... నీబుద్ధి మార్చుకో... ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలతో

మనస్సు పాడుచేసుకోకు. మన తాతలు, తండ్రులు ఇలాగే బ్రతికారు. మనమూ అలాగే బ్రతుకుదాం. వాళ్ళ అడుగు జాడల్లో నడచిపోదాం. అసలు మనతర్వాతనే గదా ఎవ్వరైనా... ముందు మనం బ్రతికిన తరువాత ఇతరుల సంగతి ఆలోచిద్దాం...'

వెంటనే నీలూ, మన్నూను గట్టిగా కౌగిలించుకున్నాడు.

'ఎంతమంచివాడవు మన్నూ... అయితే మనమూ వాళ్లూ బ్రతికే సూత్రం ఒక్కటి చెపుతాను. కాస్త విను. మన్నూ ..' అన్నాడు.

మన్నూ విసుక్కున్నాడు. 'సరే ఏమిటి...' అన్నాడు.

నీలూ ఎందుకనో ఒక్కసారి పులకించిపోయాడు. అతనిలో వేయి నెమళ్ళు పురివిప్పుకొని నాట్యమాడుతున్నాయి. 'మన్నూ... నేను ఓ క్రొత్త పనిముట్టు కనిపెట్టాను. దానితో ఈ ప్రజల బ్రతుకులే మారిపోతాయి. ఇక ఎప్పుడూ ఎవ్వరూ దెబ్బలాడుకో నవసరంలేదు. అందరూ ఎంతో హాయిగా బ్రతకొచ్చు.'

మన్నూ చిరాగ్గా: 'నీ కవిత్వం కట్టిపెట్టి అసలు సంగతి చెప్పూ... ఎప్పుడూ ఇలాంటి కబుర్లే చెపుతావు...'

'అది కాదు మన్నూ... నేను నాగలిని కనిపెట్టాను! ప్రపంచ ప్రజల్ని ఏకంచేసే నాగలిని కనిపెట్టాను! ఇక రక్తపాతం ఉండదు. ఇక తిండికోసం మనిషిని మనిషి దోచుకో నక్కరలేదు.'

విడ్డూరంగా మన్నూ, నీలూవైపు చూచి, 'నాగలి ఏమిటీ...' అన్నాడు.

నీలు, మన్నును గబగబా తన గుహలోనికి తీసుకొని పోయాడు. నాగలిని చూపించాడు.

"అరే చిత్రంగా ఉందే...ఎందు కిదీ? ఏమి చేస్తుంది..." అన్నాడు మన్ను.

నీలు విశాలంగా నవ్వాడు. అతని హృదయం అందులో స్వచ్ఛంగా ధ్వనిస్తోంది. "అదేమీ చేయదు మన్నూ... మనమే చేయాలి" అన్నాడు.

"సరిగా చెప్పు నీలూ..." మన్నుకు ఏమీ అర్థం కాలేదు.

నీలూ సంతోషం పట్టలేక పోతున్నాడు. "మన అడవిలో ఎద్దులు ఎలా పొగరెక్కి తిరుగుతున్నాయో చూడూ... రెండు ఎద్దులు సంపాదించి ఈ కాడికి చెరోకవైపూ కట్టేద్దాం... ఈ కర్రు భూమిలో గ్రుచ్చి భూమిని దున్నుదాం..."

మన్ను ఆశ్చర్యపోయి, 'ఎందుకలా!' అన్నాడు.

నీలూ ఆనందానికి హద్దు ఉండడం లేదు. ప్రపంచం అతని ముందు మోకరిల్లుతోంది. అతను ఆకసాని కెదిగిపోతున్నాడు. భవిష్యత్తు పచ్చగా అతని కనుల ముందు కదలిపోతోంది!

"ఇదిగో మన్నూ... ఇప్పుడు చిన్ని చిన్ని పొదలుగా బలుస్తూన్న ఈ తృణ ధాన్యాలుతీసుకొని, మన నిప్పు కని

పెట్టిన గొడ్డలితో ఈ చెట్లను నరికి, భూమిని చదునుచేసి, వర్షాలు కురిసినప్పుడు నాగలితో దున్ని ఆ ధాన్యాలు చల్లు దాం... అప్పుడవి ఎంత చక్కగా పండుతాయో తెలుసా... చిన్న గింజపడి ఎంత మర్రిచెట్టు మొలిచిందో నీకు తెలుసుగా. అలాగే ఈ ధ్యానమున్నా ఎంత బాగా ఈ భూమిలో ఆ విత్తనాలు చల్లితే అంతకు కొన్నివేల రెట్లు ధాన్యం మనకు లభిస్తుంది. ఇక మనం ఆకలితో మాడి చావ నక్కరలేదు. ఎవ్వరి మీదికీ యుద్ధానికి పోనక్కరలేదు. ఆ తండావాళ్ళు, మనదగ్గరకొస్తే వాళ్ళకీ మనం ఇంతబువ్వ పెట్టవచ్చు. మన కీనాగలిచేసిన ఉపకారం వాళ్ళకూ చెప్పి ఇలాగే వాళ్ళనూ భూమి దున్నుకొని బతకమంటే వాళ్లూ ఇక మన మీదికిరారు. అందరూ హాయిగా బ్రతకొచ్చు. అప్పుడు మనమూ, మిగిలిన ఆ తండాలు కలిసి ఒక్క కుటుంబముగా ఉండవచ్చు. 'అప్పుడు మనం ఎక్కడికి వెళ్ళినా భయంలేదు. వీడు ఆ తండావాడు, వాడు ఈ తండావాడు అన్న భావమే ఉండదు. అందరూ ఒక్కటే...ఎంతో స్నేహంగా అంద రమూ కలసి సుఖంగా జీవించవచ్చు. ఈ నాగలి మనదగ్గరకు ఆకలిని చేరనివ్వదు..."

మన్యూ విస్తుపోతూ, "బలేగా ఉందే...మరి ఇన్నాళ్ళూ చెప్పావుకావేం? ఇప్పుడే ఈ సంగతి మా దొరకు చెపుదాం పద... ..." అన్నాడు.

నాగలిని నీలూ భుజంమీద వేసుకున్నాడు. మన్నూ ఆ నాగలిని ఒకసారి ముద్దు పెట్టుకున్నాడు. నీలూను మనసారా కౌగిలించుకున్నాడు.

"నిప్పుకన్న, నీలూ తెలివైనవాడు నిప్పు అందరినీ చంపే ఆయుధం కనిపెట్టాడు, నీలూ అందరినీ బ్రతికించే నాగలిని కనిపెట్టాడు. నీలు ఎంతగొప్పవాడు!" అనుకున్నాడు మన్ను.

"ఇక మనకు కష్టాలురావు" అని గట్టిగా అరచాడు.

దొర అప్పుడే యుద్ధానికి సిద్ధంగా ఉండమంటూ ప్రజలందరినీ హెచ్చరిస్తున్నాడు. మహాశక్తి విగ్రహంముందు అందరినీ సమాయత్తపరచాడు. శక్తి విగ్రహం నిలువెత్తు కొండను దొలిచి చేసినట్లుంది. అక్కడ పెద్ద పెద్ద ఎద్దుల తలలు ఆమె పాదాలముందు తెగిపడి ఉన్నాయి ఆమెనిండా రక్తం వెదజల్లబడిఉంది. ఆ తల్లి నేత్రాలలో జ్వాలలు చెలరేగుతున్నాయి. "నేను తల్లిని... నాకు ఈ మీ చర్యలు కిట్టు"వని ఆ ఆదిశక్తి హుంకరిస్తున్నట్లే ఉంది. కాని అక్కడ ఉన్నవారెవ్వరికీ ఆ అర్థం, అర్థం కావడంలేదు.

పెద్ద పెద్ద డప్పుల మ్రోతలు వికారంగా మ్రోగుతున్నాయి. మొలకు ఆకులతో అల్లినఅల్లికలు చుట్టుకొని, తలచుట్టూ పక్షుల ఈకలు కట్టుకొని మొగాలకు వికృతంగా రక్తం పులుముకొని భయంకరమైన అరపులు అరుస్తూ, గుండెకాయ, ప్రేగులు, సమస్తమూ కనబడేట్టు పొట్టేళ్లను చీల్చి వాటి వెచ్చని నెత్తురుకాల్వలు కడుతూండగా మెడలో

ప్రేలాడ వేసుకుని, ప్రళయంగా అరుస్తూ, ఆ వికృతరోదనలు డప్పుల మ్రోతకు సరిపడేటట్టుగా ఆ ఆదిమ మానవులు నృత్యంచేస్తున్నారు. అది విలయం... అది ప్రళయం...

దొర భయంకరంగా అరుస్తున్నాడు. అతని నేత్రాలలో అరుణకాంతులు భగభగ సెగలు గ్రక్కుతున్నాయి.

మనూ్నా, నీలూ కలిసి అక్కడకు వచ్చారు. దొర కాళ్ళ ముందు ఇద్దరూ సాష్టాంగ పడ్డారు.

నీలు, మన్ను కలసి నాగలిగురించి దొరకు ఎంతో విపులంగా చెప్పారు. కాని దొరకు అర్థంకాలేదు. అంత హెచ్చు పంట ఎలా పండుతుందో అంతభూమి ఎక్కడ దొరుకుతుందో ఆ చెట్లన్నీ నరికి భూమిని ఎలా చదునుచేయాలో ఏమీ అతనికి అర్థంకాలేదు.

నీలూ పాపం దొరకు ఎంతో అర్థమయ్యేటట్టు వివరించాడు. 'ఈ నేరేడుచెట్టు చూడుదొరా... దాని విత్తనం ఎంత ఉంటుంది ? కాని చెట్టు ఎంతపెద్ద దవుతుంది ! దానినుండి ఎన్ని నేరేడుపళ్లు పండుతున్నాయి. అలాగే ఈ ధాన్యం కూడా దొరా..." అని నీలూ ఏమిటో చెప్పబోతూనే ఉన్నాడు.

దొరకళ్ళు ఒక్కసారి భయంకరంగా సల సల మరిగిన నూనెలో నీటిచుక్క పడినట్లు వెలిగిపోయాయి.

"ఇక కట్టిపెట్టు నీలూ... చెట్లు సహజంగా వాటంతటవే పెరగాలి. నీకీమాత్రం తెలియదూ... వాటిని మనం కుత్రి

మంగా పెంచితే వాటిలో బలం ఏమీ ఉండదు. అవి పూర్తిగా నిస్సారమైపోతాయి మన పెద్దలలాగే భావించారు. వాళ్ళకన్నా నీకు ఎక్కువేమి తెలుసు? నీబుద్ధి తక్కువపనులు ఇంతటితో కట్టిపెట్టు. నేను కాబట్టి ఇదంతా సహిస్తున్నాను. నా ఈ ప్రజకు బలంలేని ఆహారం పెట్టి వారి ఆయువును క్షీణింపచేసే బుద్ధిహీనుణ్ణి కాను.''

''అదికాదు దొరా... మన ప్రజల కిప్పుడు సరియైన తిండే దొరకడంలేదు. వారు ఎక్కడెక్కడికో రోజంతా పక్షులులా తిరగవలసివస్తోంది. అప్పుడీబాధ తప్పుతుంది. వారికడుపు నిండుతుంది.'' అన్నాడు నీలూ.

''అవును ప్రభూ'' అన్నాడు మనున్న.

దొర ఒక్కసారి ప్రళయంగా అరచి, ''నీలూ... నీవు దుర్మార్గుడివి. భూమాత మన అందరికీ తల్లి. ఆ తల్లి గుండెల్ని నాగలితో పర పర కోస్తావా నీచుడా... ఇక దేశం అరిష్టాల పాలవుతుంది. అప్పుడే ఈ చెట్లకాపు తగ్గిపోయింది. ఎందుకా అనుకున్నాను. నీలాంటి పాపపుటూహాల దుష్టులు, కూడు పెట్టిన తల్లిని ఇలా దారుణంగా హింసించాలనుకుంటున్నప్పుడు, ఇక ఎన్ని అనర్థాలైనా జరుగుతాయి.''

వెంటనే నీలూ, ''నామాట వినుదొరా... రోజూ చెట్ల మీద పళ్లుతినే పిట్టలు ఎన్నో గింజలు రాలుస్తూనే ఉన్నాయి. అవన్నీ భూమిని పెకలించుకొని లోలోపలికిపోయి చెట్లుగా తయారవుతూనే ఉన్నాయి. అప్పుడు ఈ భూదేవి ఏమిబాధ

పడుతోంది పిట్టలకన్నా మనం తీసిపోయాంహూ......మనం ఒక పద్ధతిలో ఈ వ్యవసాయంచేదాం. మనకు పుష్కలంగా ఆహారం లభిస్తుంది."

దొర ఒక్కసారి కోపోద్రిక్తుడైపోయాడు.

"ఈ దుష్టుడి నాలుక త్రుంచండి. ఇప్పుడు దేశంలో అందరూ ఆహారంకోసం కష్టపడుతున్నారు. ఆ చెట్టుకూ ఈ పుట్టకూపోయి పళ్లు కాయలూ కోసుకొస్తున్నారు. హాయిగా బ్రతుకుతున్నారు. ఇకముందు ఎవ్వరో కొందరే పండిస్తారు. మిగిలినవాళ్ళు కూర్చుంటారు. నీచులు, దొంగలు హెచ్చిపోతారు. చంపెయ్యండి నీలూను. అందరికీ పని లేకుండాచేసి, కొందరికే పనిచెప్పే ఈ నీలూ నాగలిని పాతెయ్యండి... నీలూ సంఘద్రోహి..."

వెంటనే నీలూ గట్టిగా అరచాడు. "నేను సంఘద్రోహిని కాను. ఎన్నటికీ అలా కాలేను. అందరమూ దున్నుదాం. అందరమూ హాయిగా బ్రతుకుదాం. మన జనాభా తక్కువ. మనకున్న భూమి ఎక్కువ. మన జనసంఖ్య రోజురోజుకీ పెరుగుతూంది. రోజూ ఇలాగే చెట్టుకొకడుగా పుట్టకొకడుగా తిరుగుతూ దొరికితే దొరికినట్లు లేకపోతే లేనట్లు బ్రతకడం హీనం. ఇలాగైతే మన తండా త్వరలోనే క్షీణిస్తుంది. మనతండా ప్రాణం నిలిపేందుకు ఈ నాగలి ఆధారం! దీన్ని విడిచి మనల్ని మనమే చంపుకోవడం దూరదృష్టిలేనిపని..." అన్నాడు.

దొర రౌద్రరూపందాల్చి, 'నీలూను చంపండి. ఇంకా చూస్తారేం. ఇతనివల్ల సోమరితనం హెచ్చిపోతుంది. పనిలేని వాళ్ళు పెరిగిపోతారు. మనదగ్గర ఆహారపదార్థాల నిల్వలున్నాయన్న సంగతి తెలిసిందంటే మన శత్రువులందరూ ఒక్కుమ్మడిగాకలసి మనజాతిని హతమార్చేస్తారు. వద్దు. మనజాతి నాశనంకావడం నేను సుతరామూ సహించలేను. ఇదిగో ఇప్పుడే ఈనీలూను చంపేస్తున్నాను. చంపేముందు ఇంకొక్కసారి నీలూను ఆలోచించుకోమని హెచ్చరిస్తున్నాను. తన పట్టు విడిచిపెడితే సరేసరి. లేకపోతే చావు తప్పదు.

అప్పుడే మన్ను, "అన్యాయం దొరా... నిజంగా నీలూ ఈ ప్రజల ప్రాణదాత, మన శత్రువులకు కూడ ఈ ఉపాయం చెపుదాం, వాళ్ళూ మనమూ కలసి హాయిగా బ్రతుకుదాం.

అప్పుడు అక్కడ ఉన్నవారిలో కొందరు, "అవును... ఇది బాగుంది... ఇది బాగుంది..." అని అరచారు.

ఈ విప్లవ బీజాలు అప్పుడే నాటుకుంటూన్నట్లు దొర గ్రహించాడు.

వెంటనే అతను కఠోరంగా కంఠాన్ని పెగిల్చి, "మీరంతా మూర్ఖులు, అందమైన మాటల చాటున ఈ నీలూ విషాన్ని దాచాడు. శుంఠలూ... ఈ చెట్లన్నీ నరకడం. ఈ భూమిని చదును చేయడం... మీతరంకాదు. ఇదంతా వృథా... వృథా ఈ ప్రయాస. ఆ తరువాత వర్షాన్ని నమ్ముకోవాలి. వర్షం కురవకపోతే మీకు పంట ఉండదు. అప్పుడు తిరిగి

మళ్ళీ ఈ చెట్లదగ్గరకే రావాలి. మీకు దూరదృష్టిలేదు. మీరెందుకూ పనికిరారు. ఆ పైన భూమాత ఎంత ఆగ్రహిస్తుందో... ఆ తల్లి ఆగ్రహిస్తే మనం ఎక్కడ నిలవగలం? ఈ కష్టాలేవీ మీకు తెలియవు. తెలియకుండానే నోటికొచ్చినట్లు మాత్రం వాగుతున్నారు."

అప్పుడు కొందరు, "తప్పుక్షమించు దొరా... మాకు ముందుచూపు లేదు. ఈ నీలూను వెంటనే చంపెయ్... ఇలాంటి వాడుంటే మనలో మనకు చీలికలేర్పడతాయి అని అరచారు.

వెంటనే నీలూ, "ఎప్పుడూ కష్టపడకుండా ఎవ్వరికీ ఏమీ లభించదు. మనలో చీలికలు వద్దు. మనం ఇతరులమీదికి యుద్ధానికిపోవడం, వారితో దెబ్బలాడి మనవారిని ఎంతో మందిని పోగొట్టుకోవడం...... కొందరమే మిగలడం ఇదంతా ఏమిటి? ఈ జననష్టానికి దొర ఏమి చెప్పతాడు? ముసలివాళ్ళను మనవాళ్ళెవ్వరూ చూడటంలేదు. వాళ్ళకు పళ్ళూకాయలు తెచ్చిపెట్టేవాళ్ళేలేరు, అందరూ ఎవరిపొట్ట గురించి వారే చూసుకుంటున్నారు. దొర ఆజ్ఞలిచ్చినప్పుడు ఆ యుద్ధాలకుపోయి కాళ్ళు తెగగొట్టుకొని, చేతులు విరగ్గొట్టుకొని అంగవిహీనులై నిస్సత్తువును పెంచుకుంటున్నారు. ఇదంతా ఇకముందు ఉండకుండా ఉండాలంటే మనమంతా కష్టపడి వ్యవసాయంచేదాం. ఈ సెలయేళ్ళకు కాల్వలు త్రవ్వుదాం. చెట్టు, భూమిమీద బ్రతుకుతూందంటే తప్పక

భూమిలో నీరు ఉండి ఉంటుంది. అంచాత మనం వర్షాలున్నా యని లేవని భయపడనక్కర లేదు. నూతులు త్రవ్వితే కావలసినంత నీరు తప్పక దొరుకుతుంది. దొరా నామాట విను... మొదట్లో ఈపని ఎంతో అగమ్యంగానూ... కష్టతర మైందిగాను ఉంటుంది. కాని రాను రాను ఎంతో సులభమై ప్రజలకు సుఖశాంతుల నిస్తుంది. ఈ ప్రజల జీవనస్థాయి పెరుగుతుంది. ఇప్పుడు ఏరోజు కారోజే రేపటిగురించి భయం అప్పుడీ భయం ఉండదు'' అన్నాడు.

వెంటనే దొర తన గండ్రగొడ్డలి ఎత్తి గబాలున నీలూ నెత్తిమీదకు విసిరాడు. మన్నూ పాపం ఆ వ్రేటుకు అడ్డు నిలిచాడు. ఇంకేముంది వెంటనే అతను నేల కొరిగిపోయాడు.

"ఇది అన్యాయం... అన్యాయం'' అని ఎవ్వరో అరచారు.

దొర వెంటనే, "చీడ పురుగులు ... చంపండి వాళ్లను.'' అంటూ, నీలూను, మహా మేధావిని ప్రపంచం మనుగడకు తపించిపోయిన ఆ శాంతమూర్తిని వెంటనే నేల గూల్చి వేశాడు.

చనిపోతూ నీలూ, "అందరి క్షేమమే నా ఆశయం దొరా ... నేను చనిపోయినా ఈ నాగలి చావదు. అది అందరి సుఖాలకోసం బ్రతుకుతుంది!'' అన్నాడు.

తెలుగు స్వతంత్ర
12—9—1959